ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 17 మార్చి 2025

ఉష్ణోగ్రత : గరిష్ఠం 40.6 కనిష్ఠం 16.4

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:32 (సోమవారం సాయంత్రం)
సహర్: 5:00 (మంగళవారం ఉదయం)



దారంతా పసుపు వర్ణం

రోడ్లు పూలవనాలయ్యాయి. ఘట్‌కేసర్ నుంచి కీసర వెళ్లే ఔటర్ సర్వీసు రోడ్లకు ఇరువైపులా చెట్లు పసుపువర్ణం పూలతో వాహనదారులను కట్టిపడేస్తున్నాయి. దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఈ పూల చెట్లు కనువిందు చేస్తున్నాయి. ఎండలకు మెరిసిపోతూ ఆకట్టుకుంటు న్నాయి. అలాగే ఘట్‌కేసర్ నుంచి కీసర వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులోనూ పలుచోట్ల చెట్లు నిండుగా పసుపు రంగు పూలతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

- ఘట్‌కేసర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):




ఫ్యూచర్‌సిటీలో గ్రామాలన్నీ కలపాలి

- మహేశ్వరం మండల అఖిల పక్ష నాయకుల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న కాకి ఈశ్వర్

మహేశ్వరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రూపొందిస్తున్న ఫ్యూచర్‌సిటీలో మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను విలీనం చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సీనియర్ పాత్రికేయులు వత్తుల రఘుపతి అధ్యక్షతన కర్నాటి భవన్‌లో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని తుమ్మలూరు, మొహబ్బత్‌నగర్ గ్రామాలను మాత్రమే ఫ్యూచర్‌సిటీలో విలీనం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. మిగితా 28 పంచాయతీలను సైతం కలపాలన్నారు. ఇందుకోసం సీఎం రేవంత్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే సబితారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఫ్యూచర్‌సిటీలో మహేశ్వరాన్ని విలీనం చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు బాటలు వేసినట్లుగా ఉంటుందన్నారు. అలా చేయకపోతే అఖిలపక్ష నాయకుల కార్యాచరణ మరింత ముందుకు వెళ్తుందన్నారు. సమావేశంలో మల్లేష్‌యాదవ్, కర్నాటి మనోహర్, పాపయ్యగౌడ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, కె. జంగయ్యయాదవ్, కాకి ఈశ్వర్, కె. చంద్రయ్యముదిరాజ్, యాదీష్, కంది రమేష్, ఆంజనేయులు, సురేష్, దత్తునాయక్, దేశ్యానాయక్, సుదర్శన్‌యాదవ్, శ్రావణ్, రాజునాయక్ పాల్గొన్నారు.

పత్తి కట్టెతో కంపోస్టు 7
- సహజ ఎరువుతో తగ్గనున్న పంట పెట్టుబడి



ఒత్తిడిని తట్టుకోలేక, క్షణికావేశంలో అనాలోచితంగా విద్యార్థులు ప్రాణాలను వదిలేస్తున్నారు. ప్రిన్సిపాల్ మందలించాడని, ఫీజులు కట్టలేకపోతున్నామని, పరీక్షలో తప్పారని ఇలా చిన్నచిన్న కారణాలతో ఎంతో భవిష్యత్ ఉన్న స్టూడెంట్స్ బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల విద్యార్థినీ విద్యార్థులు ఆత్మహత్యల సంఖ్యను చూస్తే ఆందోళన కలిగిస్తోంది. ఏడాది కాలంలో ఉమ్మడి జిల్లాలో పది మంది సూసైడ్ చేసుకోగా, మరొకరు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. ఆత్మహత్యల్లో రంగారెడ్డి జిల్లా టాప్‌లో నిలిచింది. సంవత్సర కాలంలో జిల్లాలో ఐదుగురు విద్యార్థులు అర్ధంతరంగా తనువు చాలించారు. మరో విద్యార్థి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. వికారాబాద్ జిల్లాలో ముగ్గురు, మేడ్చల్ జిల్లాలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.

ఒత్తిడికి చిత్తు!

- క్షణికావేశంలో ప్రాణాలొదులుతున్న స్టూడెంట్స్
- చిన్న కారణాలతో బలవన్మరణం
- ఏడాదిలో పది మంది మృతి
- అత్యధికంగా ఐదుగురు రంగారెడ్డిలోనే..

ఉమ్మడి జిల్లాలో హడలెత్తిస్తున్న విద్యార్థుల ఆత్మహత్యలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అందులో ఇద్దరు ఇంటర్ విద్యార్థులతో పాటు పదో తరగతి చదువుతున్న మరో స్టూడెంట్ ఆత్మహత్య చేసుకున్నాడు. షాద్‌నగర్ పట్టణానికి చెందిన సాత్విక్(15) హైదరాబాద్ కూకట్‌పల్లిలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలలో ఉపాధ్యాయుల వేధింపులు భరించలేక గతేడాది మార్చిలో హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లింగపల్లికి చెందిన మరో విద్యార్థి రాఘవేందర్ (15) చైతన్య కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఉపాధ్యాయుల వేధింపులు భరించలేక మార్చి 24న హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. షాద్‌నగర్ పట్టణానికి నీరజ్(15) స్థానిక శాస్త్ర పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఉదయం స్కూల్‌కు వెళ్లిన అతను స్నేహితులతో కలిసి

మిగతా 6వ పేజీలో...



గ్రామీణ రోడ్ల నిర్మాణం
వెంటనే చేపట్టాలి

- ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న పట్నం మహేందర్‌రెడ్డి

చేవెళ్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ రోడ్ల నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని రేగడిఘనాపూర్ గ్రామంలోని మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి నివాసానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీని కలిసి రోడ్డు నిర్మాణ పనుల జరగడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మహేందర్‌రెడ్డి వెంటనే పంచాయతీరాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్‌లో సంప్రదించారు. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో రేగడిఘనాపూర్- చన్వల్లి గ్రామానికి వేళ్లే రోడ్డు నిర్మాణంతోపాటు బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.80 లక్షలు నిధులు మంజూరయ్యాయని, పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. రోడ్డు పనులకు ఇటీవలే టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభిస్తామని ఎస్‌ఈ వివరించారు. అయితే బ్రిడ్జికి కేటాయించిన నిధులు క్యాన్సిల్ కావడంతో మరోమారు ప్రతిపాదనలు పంపించాలని కోరారు. అనంతరం పట్నం మాట్లాడుతూ.. బ్రిడ్జి నిర్మాణం కోసం మరోమారు ఎమ్మెల్యే యాదయ్య ప్రతిపాదనలు పంపిస్తే జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు చేవెళ్ల కాంగ్రెస్ యువ నాయకుడు రఘువీర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని రఘువీర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని మహేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, నర్సింలు, గ్రామస్తులు శ్రీరాంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చంద్రయ్య, నర్సింహ్మారెడ్డి ఉన్నారు.

లక్ష కిలోమీటర్ల రథయాత్రను
జయప్రదం చేయండి

షాద్‌నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న నిర్వహించే లక్ష కిలోమీటర్ల రథయాత్రను జయప్రదం చేయాలని రాష్ట్ర నాయకులు మంచాల భిక్షపతి పిలుపునిచ్చారు. ఆదివారం డీఎస్‌పీ జిల్లాస్థాయి సమావేశం షాద్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భూమిలేని పేదలందరికీ భూములు పంచేందుకే పార్టీ అధినేత విశారదన్ మహారాజ్ రథయాత్ర చేపడుతున్నారని తెలిపారు. అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయాలపై కూడా ప్రజలకు వివరిస్తామన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ గంట్లవెల్లి రాకేష్, కోకన్వీనర్‌లు అహ్మద్‌పాషా, లాలయ్య ముదిరాజ్, నర్సింహులు, రాజు, శ్రీను పాల్గొన్నారు.

ప్రభుత్వంతో కొట్లాడైనా
నిధులు మంజూరు చేయిస్తా

ఎమ్మెల్యే సబితారెడ్డి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కందుకూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయాలకతీతంగా నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ఆదివారం మండల ఎంపీటీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కొలన్‌గూడ మాజీ సర్పంచ్ ఆదర్ల గీతేశ్వరిగణేష్, కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డిలు నగరంలోని ఆమె నివాసానికి వెళ్లి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం తాను ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ కందుకూరు, మహేశ్వరం మండలాలతో పాటు తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలు, మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్‌లు, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, డివిజన్‌లలో అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కొట్లాడైనా నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. ముఖ్యంగా కొలన్‌గూడ నుంచి ఎలిమినేడు వరకు 5కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు మరమ్మతుల కోసం కావాల్సిన నిధులకు ఎస్టిమేషన్ తయారు చేయిస్తానని ఆమె హామీ ఇచ్చారు. కందుకూరు నుంచి ఫార్మా రోడ్డు వరకు అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. జి.బీరప్ప, బండ వేణు కొలన్గఊడ గ్రామస్తులు పాల్గొన్నారు.



కదంతొక్కిన కాంగ్రెస్

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పట్ల సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. నందిగామలో కేటీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు.

విమానంలో సాంకేతిక లోపం

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో.. సురక్షితంగా ల్యాండింగ్
- విమానంలో 73 మంది ప్రయాణికులు

శంషాబాద్ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కౌలాలంపూర్ నుంచి 73 మంది ప్రయాణికులతో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఎయిర్‌ఏషియా ఏకే 069 విమానం గాల్లో ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. గుర్తించిన పైలెట్లు శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు. ఏటీసీ అధికారుల సూచనల మేరకు పైలెట్లు విమానాన్ని శనివారం రాత్రి 11.08 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. విమానం ల్యాండింగ్ అయ్యే వరకు ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విమానం సురక్షితంగా ల్యాండ్ కావడంతో విమానంలో ఉన్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. చిన్న లోపం వల్లే విమానంలో సాంకేతిక సమస్య ఏర్పడిందని మరేమీ లేదని ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి. తిరిగి ఆదివారం విమానం మలేషియాలోని కౌలాలంపూర్‌కు బయలుదేరి వెళ్లిందని ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి.

సొంతింటి కల సాకారమెప్పుడో?

ఇళ్ల కోసం ఏళ్లతరబడి ఎదురుచూపులు

- కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు
- డబుల్ బెడ్‌రూంల నిర్మాణం పూర్తయినా కేటాయింపుల్లేవ్
- అద్దెలు కట్టలేక ఇబ్బందుల్లో పేదలు


ఆదిభట్ల మున్సిపాలిటీ ఎంపీ పటేల్‌గూడలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

ఇబ్రహీంపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు సొంత గూడు కోసం ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలోనే పేదలకు కొంతవరకు ఇళ్ల స్థలాలైనా దక్కాయి. కొందరు ఇందిరమ్మ పథకం కింద సొంత ఇళ్లు నిర్మించుకున్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇళ్లు లేని పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆశ చూపింది. తొమ్మిదిన్నరేళ్లు గడిచినా ఒక్కరికీ కూడా ఇల్లు ఇచ్చిన దాఖలాలు లేవు. పేదలకు కనీసం గజం జాగా కూడా దక్కలేదు. ఇప్పటికీ ఇళ్లులేని అనేక మంది గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. మరి కొందరు అద్దె ఇళ్లలో ఉంటూ పొట్టపోసుకుంటున్నారు. ఇబ్రహీంపట్నం పరిధిలో వేలాది ఎకరాల ప్రభుత్వ, భూదాన్ భూములను అనేక ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలకు కేటాయించారు. కానీ ఇళ్లులేని పేదలకు స్థలాలు కేటాయించలేదు. ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోతే ప్రైవేటు భూములు కొనుగోలు చేసైనా ఇళ్ల నిర్మాణం చేస్తామని ప్రకటించినా అది అమలు నోచుకోలేదు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అనేక మంది పేదలు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఏ ఒక్కరికీ ఇల్లు నిర్మించి ఇచ్చిన పాపాన పోలేదు.

ఐదు నియోజకవర్గాల్లో 2,317 డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి

నియోజకవర్గాలైన ఇబ్రహీంపట్నం 331, షాద్‌నగర్ 1880, రాజేంద్రనగర్‌లో 130, మహేశ్వరం 80, చేవెళ్లలో 72 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. వీటిల్లో కరెంటు, తాగునీటి వసతి, డ్రైనేజీ వ్యవస్థ తదితరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాగా గత ప్రభుత్వం కొన్నిచోట్ల లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఇప్పుడు ఈ లిస్టును తిరిగి సమీక్షించడంతోపాటు కొత్తగా అర్హులను గుర్తించనున్నారు. కాగా ఒక్కో నియోజకవర్గంలో వేల మంది ఇళ్లకోసం ఎదురు చూస్తుండగా ఈ ఇళ్లు ఎవరికి దక్కనున్నాయో వేచిచూడాల్సిందే.

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అప్పట్లో మొత్తం 1200 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో మంచాల మండలం లింగపల్లి గేట్ వద్ద 96 ఇళ్లు, ఆదిభట్ల మున్సిపాలిటీ

మిగతా 8వ పేజీలో...

కొత్తకుంట మరమ్మతులతో పరిగికి అందం

పరిగి, మార్చి16(ఆంధ్రజ్యోతి):పరిగి శివారులోని కొత్తకుంటకు మరమ్మతులు చేస్తే పట్టణానికే అందమొస్తుందని పరిగి ఏఎంసీ చైర్మన్ బి.పరశరాంరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి కె.హన్మంతు, పార్టీ పట్టణాధ్యక్షుడు కృష్ణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ అన్నారు. రూ.29.4లక్షలతో చేపడుతున్న


పనులను పరిశీలిస్తున్న నాయకులు

పనులను వారు ఆదివారం పరిశీలించారు. కొత్తకుంట పర్యాటక ప్రాంతంగా మారుతుందన్నారు. నీటి నిల్వతో బోర్లలో నీటిమట్టం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు తావుర్యా, టి.వెంకటేశ్, అక్బర్, అయ్యూబ్, శ్రీధర్, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి చిత్తు!

(5వ పేజీ తరువాయి)



క్లాస్‌రూం నుంచి కారిడార్‌కు వచ్చాడు. ఇది గమనించిన ప్రిన్సిపాల్ నరేందర్‌రాజయ్ వారిని మందలించాడు. దీంతో ఈ నెల 6వ తేదీన సాయంత్రం 4గంటలకు స్కూల్ పైఅంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన షాద్‌నగర్‌లో కలకలం రేపింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా మరో విద్యార్థిని ఆత్మహత్యా యత్నం చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీనగర్ కాలనీకి చెందిన సీహెచ్.గౌతమ్ ఆదిభట్లలోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదివేవాడు. కండ్లకలక రావడంతో 2023 ఆగస్టు 14న కాలేజీలో ఉరేసుకున్నాడు. ఇతడి మృతి అనుమానాస్పదంగా మారింది. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం అన్నాయిగూడకు చెందిన విద్యార్థిని ఫైలపాక సోని ఆదిభట్లలోని అగస్త్య జూనియర్ కళాశాల, టీసీఎస్ బ్రాంచ్‌లో లాంగ్ టర్మ్ కోచింగ్(మెడిసిన్) తీసుకుంటూ గత నెల 6న అనారోగ్యంతో మృతిచెందింది. ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యానికి గురై మృతిచెందినట్లు తెలిసింది. పోలీసులు మాత్రం ఎఫ్ఐఆర్‌లో అనారోగ్యకారణమనే నమోదు చేశారు. ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధి చర్లపటేల్‌గూడలోని జ్యోతిరావు పూలె బీసీ బాలికల రెసిడెన్షియల్‌లో పదో తరగతి విద్యార్థిని గడ్డ లావణ్య(15) 2024 నవంబరు 9వ తేదీన భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. "నీకు చదువు రాదు.. చదివి కూడా వేస్ట్" అని టీచర్లు మందలించడంతో ఆత్మహత్యాయత్నం చేసిందని బాలిక తల్లిదండ్రుల ఆరోపణ. తల్లిదండ్రులు వచ్చి చూడటం లేదనే ఆమె భవనం పైనుంచి దూకిందని పాఠశాల వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ విద్యార్థిని రాజేంద్రనగర్ సమీపంలోని లక్ష్మీగూడలో ఇంట్లోనే బెడ్‌రెస్ట్‌లో ఉంది.

కాగా వికారాబాద్ జిల్లాలో ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న శాలిని అనారోగ్యం బారినపడి ఇంట్లో ఉరివేసుకుంది. ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న జ్యోతి అనే విద్యార్థిని ఇంట్లోని వారంతా ఊరికి వెళ్లగా తానింట్లో ఉండి చదువుకుంటానని చెప్పి ఉరేసుకుంది. జ్యోతి ఎందుకు ఆత్మహత్య చేసుకుందనే విషయం తెలియరాలేదు. పరిగి నియోజకవర్గం కుల్కచర్లలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో వారం క్రితం టెన్త్ విద్యార్థి దేవేందర్ నిద్రిస్తున్న బెడ్‌పైనే చనిపోయాడు.

ఫీజుల కోసం వేధింపులు

కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల వసూలు కోసం విద్యార్థులపై తీసుకొస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థులు తనువు చాలిస్తున్నారు. తల్లిదండ్రులకు స్థోమత లేకున్నా పిల్లల భవిష్యత్తు కోసం కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేర్పి చితికిపోతున్నారు. ఫీజులు చెల్లించలేక కొందరు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతూ తమ వందేళ్ల జీవితాలను ముగించేసుకుంటున్నారు. విద్యాసంస్థల హబ్‌గా పేరుగాంచిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విద్యాసంస్థలు ఫీజుల విషయంలో చేస్తున్న వేధింపులు తాళలేక కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. ఇటీవల మేడ్చల్‌లోని శ్రీచైతన్య పాఠశాల 10వ తరగతి విద్యార్థి అఖిల ఇంట్లో ఉరేసుకోవడం అందరినీ కలచివేసింది.

విద్యార్థులపై పెరుగుతున్న చదువుల భారం

మేడ్చల్‌లోని కిష్టాపూర్ వీఎంఆర్ కళాశాలకు చెందిన బీటెక్ విద్యార్థి సిద్ధార్థయాదవ్ చదువు ఒత్తిడి తట్టుకోలేక, హాస్టల్‌లో ఉండలేక ఉరి వేసుకున్నాడు. ఘట్‌కేసర్ అన్నోజిగూడలోని నారాయణ కళాశాలలో తనుష్‌నాయక్(16) ఇంటర్ మొదటి సంవత్సరం చదివేవాడు. చదువు ఒత్తిడిని భరించలేక కాలేజీ వాష్‌రూంలో ఉరేసుకున్నాడు. అనురాగ్ యూనివర్సిటీలో సీఎస్‌సీ రెండో సంవత్సర విద్యార్థి నక్కిరెడ్డి జ్ఞానేశ్వర్‌రెడ్డి డీన్ మందలించాడని 2024 ఫిబ్రవరి 7న కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్నాయత్నం చేశాడు. దీంతో జ్ఞానేశ్వర్‌రెడ్డికి కాళ్లు విరిగాయి. నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. క్లాస్‌లో అందరి ముందు తనను తిట్టాడని సదరు విద్యార్థి ఆత్మహత్యకు యత్నించాడు.

ఫ్యామిలీ పెన్షన్ అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగుల(ఫ్యామిలీ పెన్షన్‌దారులు) కుటుంబాలకు పూర్తిస్థాయిలో ఫిబ్రవరి నెల పెన్షన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వికారాబాద్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఫ్యామిలీ పెన్షన్‌దారుల్లో కొందరికి పెన్షన్ ఇచ్చి మరికొందరికి ఇవ్వక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం జిల్లా కార్యవర్గ అధ్యక్షుడు హెచ్‌డీ.ద్వారకానాథ్, అసోసియేట్ అధ్యక్షుడు జొన్నల బస్వరాజ్, ప్రధాన కార్యదర్శి కామిడి నర్సింహారెడ్డి, కోశాధికారి జూకారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెలా పెన్షన్ వస్తేనే కుటుంబావసరాలు తీరడం కష్టంగా మారిన ఈ రోజుల్లో పెన్షన్ అందకపోతే ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందేనన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఫ్యామిలీ పెన్షన్‌దారులందరికీ పెన్షన్ డబ్బులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

నిరంజనమఠంలో ఆరాధనోత్సవాలు

కొడంగల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) కొడంగల్‌లోని నిరంజన మఠంలో ఆదివారం వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పురోహితులు మఠం మల్లికార్జున్, గడ్డం చంద్రశేఖర్, మఠం విజయ్‌కుమార్ స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనే, నెయ్యి, చక్కెర, గంధం తదితర సుగంధ ద్రవ్యాలతో బసవలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం మఠం పీఠాధిపతులు డాక్టర్ సిద్ధలింగమహాస్వామికి వీరశైవ లింగాయత్ సభ్యులు పాదపూజ చేశారు.


అలంకరణలో బసవలింగేశ్వరస్వామి

పల్లకి సేవ ముందు ఖడ్గాలు వేస్తూ స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గురునాథ్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. గురునాథ్‌రెడ్డిని సిద్ధలింగమహాస్వామి శాలువాతో సత్కరించారు. ఆలయ భజన మండలి సభ్యులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్‌వర్ధన్, బుక్క విజయ్‌కుమార్, సంగమేశ్వర్, బాలప్రకాశ్, రవి, సర్వేశ్, రాకేశ్ పాల్గొన్నారు.


గుర్నాథరెడ్డిని సన్మానిస్తున్న సిద్ధలింగస్వామి

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ప్రతిఒక్కరూ కొంత సమయాన్ని ఆధ్యాత్మిక చింతనకు కేటాయిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని నిరంజన మఠాధిపతి డాక్టర్ సిద్ధమహాలింగస్వామి అన్నారు. ఆరాధనోత్సవాల్లో ఆయన మాట్లాడారు.

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని అంకుశాపూర్ శ్రీభవానీశంకర ఆలయ కమిటీ చైర్మన్ రాజమహేందర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం ఏసీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో రామ్‌సేన టీం ట్రోఫీని గెలుచుకుంది. ఆయన ట్రోఫీ, 10వేల నగదు , రన్నర్స్‌కు బీఆర్ఎస్ నాయకుడు రాజు ఐదు వేల నగదును అందజేశారు. నిర్వాహకులు గణేష్, నరేష్, గోపాల్ రెడ్డి, మంగారెడ్డి, అంజనేయులుగౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.


ట్రోఫీ అందజేస్తున్న బత్తుల రాజమహేందర్‌గౌడ్

పత్తి కట్టెతో కంపోస్టు

● సహజ ఎరువుతో రైతులకు తగ్గనున్న పెట్టుబడి ఖర్చు


మల్కాపూర్ గ్రామంలో తీరిపోయిన పత్తి చేను

చేవెళ్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వానకాలంలో సాగుచేసిన పత్తి పంట పత్తితీత పూర్తయిక కట్టెను సాధారణంగా రైతులు కాల్చేస్తుంటారు. ఇలా చేస్తే భూమికి, రైతుకు ఉపయోగమేమీ ఉండదు. పత్తికట్టెతో వర్మి కంపోస్టు తయారు చేసుకొని పంటలకు ఎరువుగా వాడుకోవచ్చని చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పత్తి ఏరిన తర్వాత మొక్కల్ని వేర్లతో సహా పీకి కుప్పగా వేయాలి. కట్టె పరిమాణాన్ని బట్టి 30-50ఫీట్ల పొడవు, 3ఫీట్ల వెడల్పు, 3ఫీట్ల లోతుతో ఇటుకలతో కుండీలు కట్టుకోవాలి. అడుగున మొరం పోసి నేలను గట్టిపర్చాలి. ఎండకు వాడనకు ఆచ్ఛాదనగా కుండీలకు షెడ్డు వేసుకోవాలి. కుప్పగా వేసిన కట్టెను ట్రాక్టర్‌తో తొక్కించి పుల్లలుగా చేయాలి. దానిపై వారం రోజులు పశువుల పేడను వేయాలి. ఈ మిశ్రమాన్ని కుండీల్లో నింపి, నీటిని పోస్తుండాలి. అలా నాలుగైదు లేయర్ల వరకు పత్తి కట్టెను నింపాలి. చివరగా పెండ కలిపిన నీటిని చల్లాలి. రోజూ కుండీలో అప్పుడప్పుడు నీరు చల్లాలి. తరువాత ఒక్కో కుండీపై 20కిలోల చొప్పున వానపాముల్ని వదలాలి. అవి కుళ్లిన పత్తికట్టెను తింటూ... విసర్జితాలతో 20 నుంచి 25 రోజుల్లో కంపోస్టు తయారవుతుంది.

పంటలకు సూక్ష్మధాతు పోషకాల లభ్యత

పత్తి మోడులో పశువుల పేడకంటే రెట్టింపు నత్రజని, ఎనిమిది రెట్లు అధికంగా పొటాష్ ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. పత్తిలో దూది 40శాతం ఉంటే 60శాతం మోడు ఉంటుంది. ఎకరానికి 6క్వింటాళ్ల వరకు పత్తి కట్టె వస్తుంది. దీనిని భూమిలో కలియదున్నడం వల్ల 10కిలోల నత్రజని, 36కిలోల పొటాష్ భూమికి అందుతుంది. మాంగనీస్ 365పీపీఎం, ఇనుము 2,791పీపీఎం, రాగి 27పీపీఎం చొప్పున ఉంటాయి. పత్తి కట్టెలను కలియదున్నడం వల్ల తరువాతి పంటకు కావాల్సిన పొటాష్ మొత్తాన్ని, అలాగే 20శాతం వరకు నత్రజని లభిస్తుంది.

ఎన్నో ప్రయోజనాలు

పత్తి కట్టెతో వర్మి కంపోస్టు తయారీతో పలు ప్రయోజనాలు ఉన్నాయి. కంపోస్టు తయారీకి రైతుకు అవసరమైన పత్తి కట్టె ఒకేసారి ఎక్కువ పరిమాణంలో దొరుకుతుంది. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ సేంద్రియ ఎరువును తయారుచేసుకోవచ్చు. కంపోస్టు తయారైన వెంటనే అదే భూమిలో వేసే పంటకు ఎరువుగా వేసుకోవచ్చు. కాబట్టి దీనిని నిల్వచేసుకోవాల్సిన అవసరం ఉండదు. దీని వల్ల భూభౌతిక పరిస్థితులు మెరుగుపడతాయి. భూమిలో హ్యూమస్ శాతం పెరిగి నీటి నిలువ చేసుకునే పరిస్థితొస్తుంది. రసాయన ఎరువుల వినియోగమూ తగ్గుతుంది.

కట్టెను భూమిలో కలియదున్నినా సరిపోతుంది



పత్తి కట్టెలను కాల్చకుండా భూమిలో దున్నినా ఇబ్బంది లేదు. 36బ్లేడ్‌లు, 5 ఫీట్ల పొడవైన రోటావేటర్‌ను 45హెచ్‌పీ ట్రాక్టర్‌తో తీరిపోయిన పత్తి చేనులో దున్నితే రైతులకు లాభాలున్నాయి. ఇలా చేస్తే పత్తి కట్టె భూమిలో కలిసిపోయి ఆరు ఇంచ్‌ల లోతు వరకు మట్టి కూడా తలకిందులైతుంది. పత్తి కట్టె కుళ్లి పంటకు కంపోస్టు ఎరువుగా ఉపయోగపడుతుంది.

- శంకర్‌లాల్, ఏవో, చేవెళ్ల

రూ.10వేల వేతన హామీని అమలు చేయండి

● మధ్యాహ్న భోజన కార్మికుల వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

షాద్‌నగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, పడుతున్న ఇబ్బందుల గురించి అసెంబ్లీ, శాసనమండలి దృష్టికి తీసుకువెళ్లాలని భోజన కార్మికులు కోరారు. ఆదివారం వారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిలను కలిసి వినతి పత్రం అందజేశారు. భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు 8నెలలుగా గుడ్లు, 3 నెలలుగా వేతనం, గౌరవవేతనం, మెనూచార్జీల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అప్పు తెచ్చి విద్యార్థులకు వండిపెడుతుండడంతో కార్మికులు కష్టాలుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు ఇవ్వకున్నా విద్యార్థులకు వండిపెట్టాలని ఒత్తిడి సరికాదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, మెనూచార్జీలు మాత్రం పెంచడంలేదన్నారు. ఏళ్ల తరబడి వేతనాలు పెంచలేదన్నారు. వారానికి మూడుసార్లు గుడ్లు ఇవ్వాలని నిబంధన పెట్టారుగానీ సరిపోను బడ్జెట్ ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భోజన కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీలత, శ్రీనివాస్, వసంత, సంతోష, సత్తెమ్మ, వెంకటమ్మ, అనిత, షహీనబేగం తదితరులు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలి


విజేత స్కూల్ విద్యార్థులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్

కోట్‌పల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలని శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం కోట్‌పల్లిలోని విజేత టాలెంట్ స్కూల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు పేరుతేవాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో డ్యాన్సు చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ వెంకట్ రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్, నరసింహారెడ్డి, బందయ్య, జగన్నాథ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఎండలతో జాగ్రత్త

● ఉదయం 10గంటలకే సూర్యుడు భగ్గు
● వడదెబ్బకు గురయ్యే ప్రమాదం
● స్వీయ రక్షణే మేలంటున్న వైద్యులు



దుద్యాల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలు భగ్గుమంటున్నాయి. తీవ్ర ఉష్ణోగ్రతలు, వడగాలుల సమయంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దాహం వేయకపోయినా వీలైనప్పుడల్లా నీరు తాగాలని చెబుతున్నారు. ఉబ్బరం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కొబ్బరి నీరు, కూల్ డ్రింక్స్, జ్యూస్ వైపు మొగ్గు చూపుతున్నారు. అదే విధంగా కూలర్లు, ఫ్యాన్‌ల కింద సేద తీరుతున్నారు.

● ఎండలో వెళ్లే సమయాల్లో...

బయటకు వెళ్లే సమయంలో నీటి బాటిల్‌ను వెంట తీసుకెళ్లాలి. వదులుగా ఉండే కాటన్ దుస్తులనే ధరించడం మంచిది. టోపీ, టవల్ లాంటి వాటిని ఎండకు ఆచ్ఛాదనగా కప్పుకోవాలి. గొడుగు పట్టుకోవాలి. ఎండలో నడిస్తే చెప్పులు తప్పక ధరించాలి. ఇంట్లో తయారు చేసిన మజ్జిగ, నిమ్మరసం లాంటివి వెంట తీసుకెళ్లాలి. సంత్ర, ద్రాక్ష, పుచ్చ, తర్బూజ లాంటి అధిక నీటి శాతం ఉన్న పండ్లను తినాలి. వివిధ పండ్ల రసాలూ తాగాలి. చెరకు రసం కూడా తాగితే ఎండలో శరీరానికి అవసరమయ్యే మినరల్స్ లభిస్తాయి. భోజనంలో ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తినాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు వెళ్లేలా చూసుకోవాలి. మధ్యాహ్న సమయాల్లో వంట గదిలో వంట చేయకూడదు. తప్పనిపరిస్థితుల్లో వంట చేయాల్సి వస్తే వెంటిలేషన్ ఉండాలి. తలుపులు, కిటీకీలు తెరిచి ఉంచాలి. మద్యం, కాఫీ, టీ వంటి వేడిచేసే పానీయాలు ఎక్కువ తాగకూడదు. ఆరుబయటకు పనిచేసే కూలీలు పని ప్రదేశాల్లో తాగునీటిని ఉంచుకోవాలి. 30 నిమిషాలకోసారి ఓ గ్లాసు నీరు తాగాలి. ఎండల్లో సాధారణ వ్యక్తుల కంటే రోగులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. శిశువులు, చిన్నారులు,గర్భిణులు, వృద్ధులు బయట పనిచేసే కూలీలు, అధిక రక్తపోటున్న వారు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలి.

వడదెబ్బ లక్షణాలు.. జాగ్రత్తలు

వడదెబ్బ తగిలితే తీవ్ర జ్వరం, తలనొప్పి, బీపీ తగ్గి కళ్లు తిరగడం వంటి లక్షణాలు ఉంటాయి. వాంతులు, విరేచనాలయ్యే అవకాశం ఉంటుంది. నాలుక తడారుతుంది. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే ఎండ నుంచి చల్లని ప్రదేశానికి తీస్కొచ్చి సేదదీర్చాలి. తడి బట్టతో తుడవాలి. మజ్జిగ, నీరు, కొబ్బరినీరు తాగించాలి. ప్రథమ చికిత్సానంతరం ఆసుపత్రికి తీస్కెళ్లాలి.

అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి



వేసవి ఎండలు తీవ్రమయ్యాయి. ఎండలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు. మధ్యాహ్నం 12నుంచి 3గంటల సమయంలో ఎంత తీవ్రత ఎక్కువ. ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఎండలో చెప్పులు, తలకు టోపీ లేదా రుమాలు ధరించి ప్రయాణం చేయాలి.

- రవీంద్రయాదవ్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

ఉద్యోగుల బిల్లులు మంజూరు చేయాలి


ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో జరిగిన ఎస్టీయూటీఎస్ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఇతర సమస్యల సాధనకు రాష్ట్ర జేఏసీ ఉద్యమ కార్యాచరణను ప్రకటించిందని తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి 30 వరకు నియోజకవర్గ స్థాయిలో శాసన సభ్యులకు వినతిపత్రాల అందజేత, మే 15న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు ఉంటాయన్నారు. జూన్ 5 నుంచి 9 మధ్య రాష్ట్రస్థాయిలో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలన్నారు. ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇవ్వాలని అన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో స్థానికేతరుల కోటా మించిపోయిందని, దీంతో స్థానిక నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డి, నాయకులు సుధాకర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రావు, రాజమణి, వీరమణి, భార్గవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులను ఘనంగా సన్మానించారు.

డ్రగ్స్ విక్రయించిన నిందితుడి రిమాండ్

శంషాబాద్ రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి):డ్రగ్స్ అమ్ముతూ పట్టుపడిన నిందితుడిని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. ఆర్జీఐఏ స్టేషన్‌లో ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన అభిషేక్ సంజయ్ తోరట్(24) శంషాబాద్ పరిసరాల్లో డ్రగ్స్ అమ్ముతున్నట్లు సమాచారం రాగా ఎస్‌వోటీ టీం గణేష్ టాకీస్ వద్ద అతడిని అదుపులోకి తీసుకుందన్నారు. 13గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుందన్నారు.నిందితుడు మహారాష్ట్రలో కిరాణ షాప్ నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితుడని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఖేల్‌ఖూద్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పరిగి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో నిర్వహించిన ఖేల్‌ఖూద్ పోటీల్లో పరిగి సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు ప్రతిభను చాటారు. అండర్-14 బాలుర, బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖోల్లో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. జట్టు, వ్యక్తిగతంగా మొత్తంగా 16 బహుమతులను అందుకున్నారు. ఖోఖోలో బాలురు, బాలికలు ప్రథమస్థానం నిలిచారు. కబడ్డీ, బాడ్మింటన్‌లో బాలురు ప్రథమస్థానం, వాలీవాల్‌లో బాలురు ద్వితీయస్థానం, రిలే పరుగులో, ఇతర అథ్లెటిక్స్ అంశాల్లో సెకండ్ ప్లేస్‌లో నిలిచారు.


ప్రతిభచాటిన విద్యార్థినులతో హెచ్‌ఎం

సేవలకు గుర్తింపుగా సేవా వైభవరత్న అవార్డు


వైభవ రత్న అవార్డును అందుకుంటున్న కటకం శివకుమార్ గుప్తా

కొడంగల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సర్. సీవీ రామన్ అకాడమి (సేవా సాంస్కృతిక సంస్థ) ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ హర హర కళాభవన్‌లో నిర్వహించిన 33వ సంవత్సరం ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో కొడంగల్‌కు చెందిన ఆర్యవైశ్య సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్, లయన్స్ క్లబ్ కార్యదర్శి కటకం శివకుమార్‌గుప్తాకు సేవా వైభవ రత్న అవార్డును అందించారు. ఉగాది పురస్కారాల అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 60మందికి అవార్డులు అందించినట్లు శివకుమార్ తెలిపారు. సేవలకు గుర్తింపుగా తనకు సేవ వైభవరత్న అవార్డు, గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రం అందించి సన్మానించారని వివరించారు. ఈ సందర్భంగా ఆయన సర్.సీవీ రామన్ అకాడమీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అడిషనల్ డీఎస్పీ ఆనంద్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి కాన్షీరామ్

ఘట్‌కేసర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల రాజకీయ, సామాజిక, ఆర్థిక విముక్తి కోసం జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి కాన్షీరామ్ అని నాయకులన్నారు. ఆదివారం ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి కాన్షీరామ్ 91వ జయంతిని నిర్వహించారు. చిన్నప్పటి నుంచే కాన్షీరామ్ ఆత్మగౌరవం, క్రమశిక్షణతో కూడుకున్న జీవితాన్ని గడిపారన్నారు. సిక్కు మతంలో పుట్టినా ఏనాడూ మతం గురుంచి మాట్లాడలేదన్నారు. నాయకులు, యువత అయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాంరెడ్డి, నిర్వాహకుడు అరుణ్‌కుమార్, దాసు, సరేష్, నర్సింగరావు, రాధాకృష్ణ, శ్రీనివాస్, యాదగిరి, గణేష్ పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న నాయకులు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కొడంగల్ రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుల్‌కోడ్ గ్రామంలో ఉపాధి పనులపై ఆదివారం గ్రామసభ నిర్వహించారు. జరిగిన పనులకు సంబంధించిన నిధులు, కూలీలకు చెల్లింపులపై తనిఖీ అధికారులు వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు.

మహేశ్వరం ఏఎంసీ అభివృద్ధికి కృషి చేయాలి


కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలుపుతున్న ఏఎంసీ నూతన డైరెక్టర్లు, నాయకులు

కందుకూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేలా కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఏఎంసీ డైరెక్టర్లుగా నియామకమైన మండలానికి చెందిన ఎ.పుష్పదర్శన్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.ప్రశాంత్‌కుమార్ ఆదివారం కేఎల్లార్‌ను తుక్కుగూడ క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఆయన వారితో మాట్లాడారు. మార్కెట్ కమిటీలో అన్ని వర్గాలకు సమ న్యాయం జరిగిందని, చైర్మన్ కృష్ణానాయక్, వైస్‌చైర్మన్ యాదయ్య, కమిటీ మెంబర్లంతా ప్రభుత్వ పథకాలను రైతులకు వర్తింపజేసేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు నాగని శ్రీహరి కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, నాయకులు అఫ్జల్‌బేగ్, రాకేష్‌గౌడ్, బొర్ర సురేశ్, ఎ.బాలయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా మల్లన్న బోనాలు



షాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి):తిమ్మారెడ్డిగూడలో ఆదివారం మల్లన్నస్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. దేవతలకు బోనాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు మల్లన్న స్వామి ఆలయానికి తరలి మొక్కులు చెల్లించారు. మహిళలు బోన నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడ్డ మర్రి చెట్టు

● వాహనదారులకు త్రుటిలో తప్పిన ముప్పు

చేవెళ్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై పడిపోయిన మర్రిచెట్టును చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. చేవెళ్ల మండల పరిధి ఖానాపూర్ గేట్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కన ఉన్న మర్రి వృక్షం ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయింది. దీంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు చేసుకొని ఎక్స్‌కవేటర్‌తో మర్రి చెట్టును తొలగించారు. మర్రి చెట్టుపడిన సమయంలో రోడ్డుపై వాహనాలు రాకపోవడంతో త్రుటిలో ముప్పు తప్పిందని పోలీసులు, వాహనదారులు అన్నారు. రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చేవెళ్ల ట్రాఫిక్ ఏఎస్సై చందర్‌నాయక్, సిబ్బంది పర్యవేక్షించారు.


ఎక్స్‌కవేటర్‌తో మర్రి చెట్టును తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

చౌదరిగూడ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొందుర్గు మండల పరిధి రేగడి చిల్కమర్రి ప్రీమియర్ లీగ్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆటలో గెలిచి బహుమతులు అందుకోవడం ఆనందంగా ఉంటుందని, ఏ క్రీడలోనైనా క్రీడాకారులు స్ఫూర్తిమంతంతో ఆడాలని, గెలిచేందుకు ముందుకు సాగాలని అన్నారు. క్రీడల్లో రాణిస్తే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడాకారులు గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగేందుకు పట్టుదలతో కృషిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రామృష్ణ, రవీందర్‌రెడ్డి, బందులాల్, బుచ్చయ్య, ఖలీల్, రవిగౌడ్, సుందర్, వాసురి, నర్సింహులు రాములు, హరీశ్వర్‌రెడ్డి, ప్రవీణ్, మల్లారెడ్డి, గణేష్, రాఘవేందర్‌రెడ్డి, రవి, రాకేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి చేయూత

నందిగామ మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా తనవంతు చేయూత అందిస్తానని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఆదివారం ఆలయ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఆలయ ముఖద్వారం(ఆర్చ్) నిర్మాణం చేపడతానని తెలిపారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. అలాగే అంతిరెడ్డిగూడకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు తుమ్మల జగన్ ఆలయ నిర్మాణానికి తనవంతుగా రూ.లక్ష చెక్కును కుటుంబ సభ్యులతో కలసి ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఆల య కమిటీ మెంబర్లు బాల్‌రెడ్డి, ఎల్లయ్య, కుమార్‌గౌడ్, అశోక్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, కుమార్‌గౌడ్, జంగయ్యగౌడ్, పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

మంచి పనులకు చిరస్థాయి కీర్తి

కడ్తాల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): మనుషులు జీవిత కాలంలో చేసిన మంచి పనులను వారి మరణానంతరం కూడా గుర్తుంచుకుంటారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి అన్నారు. కడ్తాలలో ఆదివారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం గూడూరు రవీందర్‌రెడ్డిల తండ్రి నారాయణరెడ్డి సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కడ్తాల, ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల మండలాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వరుణ, స్వప్న, జయమ్మ, రజిత, ప్రభాకర్‌రెడ్డి, కిష్టారెడ్డి, కిషోర్‌రెడ్డి, ధీరజ్‌రెడ్డి, ఉదయ్, స్రవంతి, తరత్, నాయకులు బట్టు కిషన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సింహ, చందోజీ, రామ్‌రెడ్డి, వెంకటేశ్, లక్ష్మయ్య, బిచ్యా, అశ్లేషరెడ్డి, సత్యం, మల్లేశ్‌గౌడ్, జగన్, లక్ష్మీనర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.


నారాయణ రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, వంశీచంద్ రెడ్డి

చిట్టిఘనాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తాండూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం చిట్టిఘనాపూర్‌లో ఆదివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామ పెద్దల సమక్షంలో కాంగ్రెస్ నాయకులు పటేల్ విజయ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డిల సహకారంతో గ్రామంలో మస్యలు పరిష్కరించుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం గ్రామంలో కుర్వ మహేష్ ఇంటి నుంచి చెరువు కట్ట రోడ్డు వరకు సీసీ రోడ్డు వేస్తామని నాయకులు తెలిపారు. ఏళ్లుగా ఉన్న సమస్య కాంగ్రెస్ ప్రభుత్వంలో తీరుతోందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పటేల్ విజయ్‌కుమార్, పటేల్ బసిరెడ్డి, జగ్గుపటేల్, ఎం.బసిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్, మహేశ్, పట్లోళ్ల బసప్ప తదితరులు పాల్గొన్నారు.

భార్యను బస్సుకిందికి తోసిన భర్త

● తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
● భర్తను పోలీసులకు అప్పగించిన స్థానికులు

శంషాబాద్ రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి భార్యను ఆర్టీసీ బస్సు కిందికి తోసిన ఘటన శనివారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. ఆర్జీఐఏ స్టేషన్ ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం కౌకుంట్లకు చెందిన బందన్న, భార్య పద్మ బతుకు దెరువు కోసం శంషాబాద్ పరిధి రాళ్లగూడకు వచ్చారు. శనివారం రాత్రి స్వగ్రామం వెళ్లేందుకు బస్‌స్టాండ్‌కు వచ్చారు. అక్కడ భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న బందన్న పద్మను కదులుతున్న బస్ కిందికి నెట్టాడు. గాయాలైన ఆమెను 108అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. స్థానికులు బందన్నకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పద్మ పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పారని ఎస్సై తెలిపారు. అయితే ఇద్దరూ మద్యం తాగారని, కదులుతున్న బస్సు ఎక్కబోయి పద్మ బస్సు కింద పడిందని పోలీసులు చెబుతున్నారు. గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ చెప్పారు.



వైభవంగా గరుడ సేవ

తలకొండపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవునిపడకల్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం గరుడ సేవ, ఎదుర్కోళ్లు, బలిహరణం, హోమం, మోహినిసేవ, పారాయణం, ప్రత్యేక పూజలు, మహాభిషేకం, కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత, మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ తిరుపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడుశంకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సత్యంకు సన్మానం



రంగారెడ్డి అర్బన్, మార్చి16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను ఆదివారం సాయంత్రం సీపీఐ నాయకులు పానుగంటి పర్వతాలు, నర్రా గిరిలు మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలో ఆయన్ను కలిసి పూల బొకే అందజేసి సన్మానించారు.

ఆగిన బిల్లులు.. సాగని పనులు

- నిలిచిన బ్రిడ్జి నిర్మాణం
- ఏడాది గడిచినా పూర్తికాని చించోడు- అయ్యవారిపల్లి వంతెన
- రూ.3.50 కోట్లతో పనులకు శ్రీకారం

షాద్‌నగర్ రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): పనులు చేసి ఏడాది గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో బ్రిడ్జి నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఫరూఖ్‌నగర్ మండలం చించోడు-అయ్యవారిపల్లి గ్రామాల మధ్య వాగుపై ఏడాది క్రితం ఆర్అండ్‌బీ నిధులు రూ.3.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. గతంలో ఉన్న బ్రిడ్జి ఎత్తు తక్కువగా ఉండటంతో వర్షం కురిస్తే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. ఏళ్ల తరబడి ఉన్న సమస్యకు పరిష్కారం దిశగా ఏడాది క్రితం బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టారు. అయితే, బిల్లులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు.



చించోడు-అయ్యవారిపల్లి గ్రామాల మధ్య వాగుపై నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులు

రూ.1.50 కోట్ల బిల్లులు పెండింగ్!

టెండర్‌లో పనులు దక్కించుకున్న పీఏల్ఈ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ముందుగా అనుకున్న గడువులోగా పనులు పూర్తి చేయాలనే పట్టుదలతో పనులు మొదలుపెట్టింది. మొదట పనులు చకచకా సాగాయి. అయితే, సుమారు రూ.1.50 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దాంతో అప్పులు చేసి మరీ పనులు చేసినా.. బిల్లులు చెల్లించకపోవడంతో విధిలేని పరిస్థితిలో మధ్యలోనే ఆపేశారు. కాగా, డిసెంబరు 2023లో పనులు ప్రారంభించారు. తొమ్మిది నెలల్లో పూర్తి చేయాల్సిన బ్రిడ్జి నిర్మాణ పనులు బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలోనే ఆపేశారు. దాంతో వాగుకు రెండువైపులా చాలా దూరం వరకు బీటీ వేయలేదు. రోడ్డు కూడా ప్రమాదకంగా మారింది. ఈక్రమంలో అటు అధికారులు, ఇటు నాయకులు బిల్లులు చెల్లించేందుకు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదు. దాంతో బ్రిడ్జి నిర్మాణ పనులు ముందుకు సాగడం కష్టంగా మారింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఏడాది పొడవునా పారే వాగు

కొందుర్గు మండలం రావిర్యాల గ్రామ పంచాయతీ వీరసముద్రం గ్రామ శివారులో పుట్టిన వాగు ఎంకిర్యాల, చించోడు మీదుగా బాలానగర్ మీదుగా వెళ్లి డిండి నదిలో కలుస్తుంటుంది. వర్షాలు సమృద్ధిగా కురిస్తే ఏడాది పొడవునా వాగు జీవనదిలా ప్రవహిస్తుంది. వర్షాకాలంలోపు పనులు పూర్తికాకుంటే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బ్రిడ్జి పక్కనుంచి రాకపోకలకు తాత్కాలికంగా మట్టి రోడ్డును వేశారు. చిన్నపాటి వర్షం కురిసినా కొట్టుకుపోతుంటుంది. ఇతర గ్రామాలతో పూర్తిగా సంబంధాలు ఉండటం లేదు. బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. వర్షాకాలం వస్తే రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఇతర గ్రామాల ప్రజలకు కూడా ఇబ్బందిగా ఉంటోంది. అధికారులు చొరవ తీసుకొని పనులు సాగేలా చూడాలి.

- రుస్తుం శివశంకర్, చించోడు

బిల్లులు రాక పనులు ఆపేశారు



చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్ట్ తీసుకున్న సంస్థ వర్క్ నిలిపివేసింది. ఇప్పటికే త్వరగా బిల్లులు చెల్లించాలని ఉన్నతాధికారులు నివేదించాం. బిల్లులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- రాజశేఖర్, ఏఈ, ఆర్అండ్‌బీ

క్రైం కార్నర్

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య!

ఇబ్రహీంపట్నం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రెండ్రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ యువకుడు ఆదివారం ఇబ్రహీంపట్నం చెరువులో శవమై తేలాడు. కాగా, అతడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం టౌన్ చెందిన సింగారం బాలమణి, జ్ఞానేశ్వర్‌ల కుమారుడు మధు(24) ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ కింద ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడు నెలన్నర రోజులుగా విధులకు వెళ్లడం లేదు. శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయిన అతడు రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, అతని మోటార్ సైకిల్, చెప్పులు ఇబ్రహీంపట్నం చెరువు కట్ట పెద్ద తూము వద్ద గుర్తించారు. పర్సు, సెల్‌ఫోన్ మోటార్ సైకిల్ కవర్‌లో ఉన్నాయి. ఈమేరకు పోలీసులు ఆదివారం డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాన్ని రప్పించి చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు మధు మృతదేహం దొరికింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

ప్రగతి నిరోధకంగా ప్రతిపక్షాలు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



చెక్కులు అందేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు/తలకొండపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతిపక్షాలు ప్రగతినిరోధకంగా మారాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో ఆదివారం కసిరెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురు లబ్దిదారులకు మంజూరైన రూ.1.56 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అర్హులైన నిరుపేదలందరికి రేషన్ కార్డులు అందించడం జరుగుతుందని అన్నారు. నాయకులు నూదిని కొండల్‌రెడ్డి, ఎగిరిశెట్టి సత్యం, గుద్దేటి శ్రీను, సురేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, సాంబయ్య, వెంకట్ రెడ్డి, గూడూరు భాస్కర్ రెడ్డి, హన్మనాయక్, తదితరులున్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఆయన నివాసంలో గ్రామస్థులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. ఖానాపూర్‌కు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరయిందని, భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. నాయకులు వెంకట్ రెడ్డి, రాజేందర్, నర్సింహ, దశరథ్ రామ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



యాచారం : విద్యార్థుల నృత్య ప్రదర్శన

యాచారం/శంకర్‌పల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజులు తెలిపారు. శనివారం రాత్రి యాచారం మండలం నందివనపర్తి ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్ని సమస్యలను పరిష్కరించి విద్యార్థులను ఆదుకుంటామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. సీఐ నందీశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, జ్ఞాన సరస్వతి సేవాసమితి ఫౌండర్ సదావెంకటరెడ్డి తదితరులున్నారు. కాగా, విద్యార్థులు బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని మాస్టర్ మైండ్స్ స్కూల్ చైర్మన్ రాజు సంపుని తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని స్కూల్‌లో మొదటి వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డైరెక్టర్లు నాగరాజు, ఎన్‌వి. రమణ, శ్రీధర్, ప్రసన్న, గంగా భారతి, సురేష్‌కుమార్, ఖాజామస్తాన్. ప్రిన్సిపాల్ ఉషారాణి ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

చౌదరిగూడ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసంతో పాటు క్రీడాకారుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయని కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ అన్నారు. ఆదివారం కొందుర్గు మండల కేంద్రంలో జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొదటి జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను రాజేష్‌పటేల్ ప్రారంభించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, చందు, సుందర్, వాసురీ, కరాటే రమేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే క్రీడలతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని బీఆర్ఎస్ యువ నాయకులు మురళీ యాదవ్ అన్నారు. కొందుర్గు మండల పరిధిలోని ఎంకిర్యాలలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సహకారంతో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రూ.25వేల నగదు అందజేశారు. మాజీ వైస్ఎంపీపీ రాజేష్‌పటేల్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోవిందు, భీమయ్య, లింగంగౌడ్, అబ్దుల్‌కలాం, రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఆదిభట్ల : కప్పాడులో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న రాఘువేందర్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్/ఆదిభట్ల/షాబాద్/రంగారెడ్డి అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో ఉపాధి హామీ కింద చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 కోట్లతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. వెంకటేష్ గుప్త, నర్సింలు, శివ శంకర్, సురేష్, రాఘువేందర్ తదితరులున్నారు. ఇబ్రహీంపట్నం మండలం కప్పాడులో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాఘువేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నుంచి మంజూరైనరూ. 25లక్షల నిధులతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నుంచి భిక్షపతి ఇంటి వరకు సీసీ రోడ్డు పనులు, 10 వార్డులో జంగిలి పోచయ్య ఇంటి నుంచి చర్చి వరకు అండర్ డ్రైనేజీ పనులు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కృషితో చర్లపటేల్‌గూడ నుండి కప్పాడు మీదుగా రాచులూర్ వరకు రూ. 30 కోట్లతో 18 కిలోమీటర్లు, 7 మీటర్ల వేడల్పుతో బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఉడుతల సతీ్‌సగౌడ్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని మాజీ సర్పంచ్ జంగయ్య అన్నారు. షాబాద్ మండలం మల్లారెడ్డిగూడలో రూ.5 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. గ్రామస్తులు గోవర్దన్‌రెడ్డి, సత్యనారాయణ, మల్లారెడ్డి, తదితరులున్నారు. అలాగే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని నర్సప్పగూడ మాజీ సర్పంచ్ కావలి కృష్ణ అన్నారు. నందిగామ మండలం నర్సప్పగూడలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ21లక్షలతో గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొడిచర్ల శ్రీనివాస్, నీరటి రవిందర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఫటా ఫట్

చోరీల నియంత్రణకు పకడ్బందీ చర్యలు



మొయినాబాద్ సీఐ పవన్ కుమార్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిభద్రతలు, చోరీల విషయంలో రాజీపడేది లేదని, చోరీలకు పాల్పడుతున్న దుండగులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్ రెడ్డి హెచ్చరిస్తున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తే నేరాలను అరికట్టే అవకాశం ఉందని తెలుపుతున్న ఆయన.. 'ఆంధ్రజ్యోతి' తో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న: చోరీల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : గతంలో జరిగిన చోరీలపై దర్యాప్తు జరుపుతున్నాం. ప్రస్తుతం దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. దీనిపై మీరేమంటారు?

జ: ప్రధాన కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఇటీవల కొన్నింటికి రిపేర్ చేశాం. గతంలో నిందితులను సీసీ ఫుటేజీ సాయంతో పట్టుకున్నాం. దాదాపు 60 శాతం కేసుల్లో నిందితులను గుర్తించాం.

ప్ర: ఇటీవల చోరీలు ఎక్కువయ్యాయి. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జ: మా సిబ్బందితో నిత్యం గస్తీ నిర్వహిస్తున్నాం. ప్రజలు కూడా సహకరించాలి. ఏమైనా అనుమానం కలిగించే విషయమైతే సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం.

ప్ర: ఇంజనీరింగ్ కాలేజీల్లో అసాంఘిక కార్యకలాపాలు, స్టూడెంట్స్ చెడు అలవాట్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: త్వరలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యాజమాన్యాలకు నోటీసులు, సూచనలు ఇస్తాం.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : వీర్లపల్లి

కేశంపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అంటనే పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని పోమాల్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. 8 ఇళ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీవో కిష్టప్ప, పీఆర్ఏఈ నర్సింగ్‌రావు, హౌసింగ్ ఏఈ కరుణాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, పల్లె ఆనంద్ కుమార్, జగదీశ్వరప్ప, రమేష్, ఏఎంసీ డైరెక్టర్లు కరుణాకర్, భాస్కర్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, సురేష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, పర్వతాలు, రాములు, తదితరులు పాల్గొన్నారు.



చౌదరిగూడ: తూంపల్లి ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రోడ్డు నిర్మాణంతో తొలగిన ఇబ్బందులు

కొత్తూర్ : ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్తూర్-కుమ్మరిగూడ బీటీ రోడ్డు నిర్మాణంతో ఆ ప్రాంత ప్రజలకు ఇబ్బందుల నుంచి విముక్తి కలగనుందని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. కొత్తూర్-కుమ్మరిగూడ బీటీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌గౌడ్, కాంగ్రెస్ మున్సిపాలిటీ, మండల శాఖ అధ్యక్షులు జె.సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్, నాయకులు ఇందూరి శ్రీనివాస్, విజయ్‌పాల్‌రెడ్డి, మహేష్‌గౌడ్, బాల్‌రెడ్డి, చిల్కమర్రి నర్సింహ, శివశంకర్‌గౌడ్, భరత్‌గౌడ్, గోవింద్‌నాయక్, పాశం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

చౌదరిగూడ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన పాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. కొందుర్గు మండల పరిధిలోని పులుసుమామిడి, రాంచంద్రపూర్, శ్రీరంగాపూర్, జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కాంగ్రెస్ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, సింగిల్ విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సయ్యద్‌సాదిక్, పురుషోత్తం రెడ్డి, మల్లేష్‌గౌడ్, చంద్రశేఖర్, సత్యనారాయణరెడ్డి, వెంకట్‌నర్సింహారెడ్డి, రాంచందర్, నర్సింహులు, బాల్‌రాజ్, శివ, గోపాల్, నరేందర్, యాదయ్య, గోవర్ధన్‌గూడ్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారమెప్పుడో?

(5వ పేజీ తరువాయి)

ఎంపీ పటేల్‌గూడలో 204 ఇళ్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిర్యాలలో 35 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. వీటిలో లింగంపల్లి, ఎంపీ పటేల్‌గూడలలో జీ ప్లస్ టూ పద్ధతిన నిర్మాణం చేయగా.. బండరావిర్యాలలో సింగిల్‌గా డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మాణం పూర్తిచేశారు. ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోవని కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో యాచారం మండలం తక్కళ్లపల్లిలో వంద ఇళ్ల నిర్మాణం చేపట్టినా అవి పునాదుల వద్దే నిలిచిపోయాయి. అలాగే రాగన్నగూడ 144, ఎలిమినేడు 50, ఖానాపూర్ 204, ఇబ్రహీంపట్నం బాగాయత్ 84, కొంగరకలాన్ 64, నాగన్‌పల్లి 30, రాందాస్‌పల్లి 25, రంగాపూర్ 120, నందివనపర్తిలో 40 ఇళ్ల పనులు మొదలు పెట్టలేకపోయారు.

జీహెచ్‌ఎంసీ అర్బన్‌లో..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తుర్కయాంజల్ మున్సిపాలిటీ, హయత్‌నగర్ పరిధిలో 10,124 డబుల్ బెడ్‌రూం ఇళ్లు జీహెచ్‌ఎంసీ నిర్మాణం చేసింది. వీటిలో పది శాతం స్థానికులకు కేటాయించాలని నిర్ణయించారు. కాగా పలు చోట్ల లబ్ధిదారులకు పట్టాలిచ్చినా నేటికీ పొజిషన్ చూపలేదు. వీటిలోనే మూసీ రివర్ బెల్ట్‌లో ఇళ్లు కోల్పోతున్న పలువురికి పట్టాలిచ్చారు.

ఉద్యమాలు చేసినా ఫలితం శూన్యం

పేదలకు స్థలాలు ఇవ్వాలని, ఇళ్లు కట్టివ్వాలని డిమాండ్ చేస్తూ అనేకసార్లు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నా స్థలాలు దక్కలేదు. ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోభానగర్ భూదాన్ భూముల్లో, ఆదిభట్ల మున్సిపాలిటీ మంగల్‌పల్లి శివారు ప్రభుత్వభూమి మూకుదుజొన్న గుట్టపై వేలాదిమంది పేదలు నెలల తరబడి గుడిసెలు వేసుకుని ఉంటే అధికార యంత్రాంగం బలవంతంగా తొలగించింది.

స్థలం లేకపోతే అంతేనా..?

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తిరిగి తీసుకువచ్చింది. స్థలం ఉంటే ఇల్లు నిర్మించుకోవడానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తామని ప్రకటించింది. మొదటి విడతగా నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేసింది. ఇది సర్వే, ఎంపిక ప్రక్రియలో ఉంది. కాగా రెండో విడతలో స్థలంలేని వారికి ప్లేస్ చూపి ఇల్లు నిర్మించి ఇస్తామని చెబుతున్నా అది ఎంతవరకు ముందుకు వెళ్తుందో వేచిచూడాలి.

స్థలాలిచ్చి.. ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



పేదలు సొంతిళ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. కూలీ పనులు చేసుకుంటూ అద్దెలు చెల్లించలేకపోతున్నారు. 20ఏళ్ల క్రితం వరకు కొందరికి స్థలాలు కేటాయించడంతో గూడు కట్టుకున్నారు. అప్పటి నుంచి ఏ ఒక్క ప్రభుత్వం పేదల గోడు పట్టించుకోలేదు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ స్థలాలు చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

- పోచమోని నీలమ్మ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు

పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం



గత ప్రభుత్వం పేదల గోడు వినిపించుకోలేదు. ఇది ప్రజా ప్రభుత్వం. పేదలు ఆర్థికంగా బలపడటానికి అవసరమైన కార్యక్రమాలు చేపడుతోంది. అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. మొదటగా స్థలాలున్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేస్తున్నాం. స్థలాలులేని వారికి మరో విడతలో ఇళ్లు నిర్మించి ఇచ్చే విషయం ఆలోచనలో ఉంది.

- మల్‌రెడ్డి రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే

ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి



కందుకూరు : దీక్షలో మాజీ జడ్పీటీసీ పెద్దరామయ్య, తదితరులు

మహేశ్వరం/ తల కొండపల్లి/ కందుకూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేశాకే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ మహేశ్వరం మండ ల ఇన్‌చార్జి బక్కని రవి అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారంతో ఐదవ రోజుకు చేరింది. ప్రశాంత్, గణేష్, కృష్ణ, అర్జున్ శేఖర్, దశరత, శంకరయ్య, భరత్‌కుమార్ తదితరులున్నారు. మాలల ఒత్తిళ్లకు తలొగ్గి సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తునాన్నిరని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ ఆరోపించారు. తలకొండపల్లి మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేశాకే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 6వ రోజుకు చేరాయి. మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య దీక్షలను ప్రారంభించారు. చుక్కాపూర్ ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు కూర్చున్నారు. కొప్పు యాదయ్య, మల్లేశ్, రాజశేఖర్, శ్రీను, శ్రీనివాస్, శివమణి, తదితరులున్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలు పరిచాకే ఉద్యోగ నియామకాలను చేపట్టాలని మాజీ జడ్పీటీసీ జె.పెద్దరామయ్య డిమాండ్ చేశారు. ఆ సంఘం కందుకూరు మండల శాఖ అధ్యక్షుడు మల్లేపల్లి కృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. అందుగుల రాజు, గానుగపేట రాజు, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

ఆమనగల్లు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డి పల్లికి చెందిన జంతుక ఈదమయ్య 11న కడ్తాల మండలం మైసిగండి దేవాలయం వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు ఓవైసీ ఆసుపత్రికి తరలించారు. తలకు బలంగా గాయమైన ఈదమయ్య చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న 1988-89 ఎస్సెస్సీ బ్యాచ్ బాల్యమిత్రులు ఆసుపత్రి వెళ్లి పరామర్శించారు. తలాకొంత ప్రోగు చేసి రూ.50 వేలు ఈదమయ్య కుమారుడు శివకు అందజేశారు.

16కేఎస్‌పీటీ3: అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల ప్రారంభిస్తున్న సురేష్

డ్రైనేజీ పనుల ప్రారంభం

కేశంపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొనాయపల్లి గ్రామంలో ఆదివారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. సీఆర్ఆర్ నిధుల నుంచి డ్రైనేజీ నిర్మాణం కోసం రూ. 5లక్షల నిధులు మంజూరైనట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సొప్పరి జంగయ్య, గ్యార సురేష్, హరీశ్వర్‌రెడ్డి, హకీం, జంగయ్య, రాజు, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహ, హనుమంతు, రంగు నర్సింహ, లక్ష్మయ్య, లలిత, నరేందర్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



షాబాద్ : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఆమనగల్లు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్ కుమార్ పట్ల మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆమనగల్లు పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాజీవ్ చౌక్ వద్ద జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మండ్లీ రాములు, మానయ్య, జగన్‌లు తదితరులున్నారు.

కడ్తాల్ : స్పీకర్ పట్ల జగదీశ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కడ్తాల మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. రాజీవ్ చౌక్ వద్ద జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆమనగల్లు మార్కెట్ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీచ్యనాయక్, నాయకులున్నారు.

తలకొండపల్లి : మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మోహన్‌రెడ్డి, అజీం, రవీందర్ యాదవ్, డిగ్రీకృష్ణ, తదితరులున్నారు.

రంగారెడ్డి అర్బన్ : నందిగామ మండలాధ్యక్షుడు నర్సింలు ఆధ్వర్యంలో కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కావలి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : జగదీశ్‌రెడ్డి అహంకార ధోరణి మార్చుకోవాలని, లేదంటే తగిన బుద్ధి చెబుతామని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ అన్నారు. కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల దిష్టిబొమ్మలను షాబాద్‌లోని ముంబై-బెంగుళూరు బైపాస్ జాతీయ రహదారిపై దహనం చేశారు. మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లింగం, యాదగిరి, నర్సింహులు, మాజీ ఎంపీటీసీ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : చేవెళ్ల నియోజకవర్గ సీనియర్ నాయకుడు సున్నపు వసంతం, కాంగ్రెస్ చేవెళ్ల మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి పట్టణ కేంద్రంలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ ర హదారిపై నిరసన వ్యక్తం చేసి కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు జనార్దన్‌రెడ్డి, ఆగిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండుయాదవ్, చేవెళ్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మర్ రాములు, డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

రంగారెడ్డి అర్బన్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మండల శాఖ అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, మున్సిపల్‌శాఖ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్‌లు పాల్గొన్నారు.

మహేశ్వరం : స్పీకర్ ప్రసాద్ కుమార్‌తో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేటీఆర్, జగదీశ్‌రెడ్డిలు క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ క్యాడర్ తిరగబడి తరిమికొట్టక తప్పదని మహేశ్వరం మండల మాజీ అధ్యక్షుడు ఈశ్వర్‌ముదిరాజ్ అన్నారు. మండల కేంద్రంలో జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అల్లెకుమార్, అంద్యానాయక్, భిక్షపతి, లాజర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



కడ్తాల : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు